బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు
ఏర్పాటు చేయాలి

కాచిగూడ, మే 15 : బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్ కోరారు. బుధవారం నింబోలిఅడ్డాలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. బీసీ కార్పొరేషన్లకు పాలక మండళ్లను నియమించి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ కులాల ఫెడరేషన్ల నియమ, నిబంధనలను మార్చాలని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, సబ్సిడీ రుణాలకు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రశాంత్ నిమ్‌కార్, పులిజాల కృష్ణ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను
సద్వినియోగం చేసుకోవాలి

చర్లపల్లి, మే 15: ప్లాస్టిక్ రంగంలోని శిక్షణ తరగతులను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని రామగుండం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు పేర్కొన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలాజీ(సీపెట్)లో ఎన్టీపీసీ సహకారంతో నిర్వహించిన ఆరు నెలల శిక్షణ తరగతులను ఆయన సీపెట్ హెడ్, చీఫ్ మేనేజర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యుగంలో ప్లాస్టిక్ రంగం కోర్సులకు అధిక డిమాండ్ ఉందని, సీపెట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గతంలో ఎన్టీపీసీ సహకారంతో శిక్షణ తీసుకున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించామని ఆయన గుర్తు చేశారు. సీపెట్ చీఫ్ మేనేజర్ డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సీపెట్‌లో నిరుద్యోగ యువతీయువకులకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం గతంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎన్టీపీసీ హెడ్, హెచ్‌ఆర్ విజయ్‌కుమార్ సిక్దార్, ఎన్టీపీసీ అధికారులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షిస్తూ.. ఉస్మానియా యూనివర్సిటీ అంటేనే.. ఓ చరిత్ర..ఉద్యమాలకు ఊపిరి..అలాంటి వర్సిటీలో రోజుకు పదుల సంఖ్యల్లో విద్యార్థులతో పాటు కుటుంబ సమేతంగా వచ్చి ఇక్కడ సేదతీరుతుంటారు. అలాంటి ఆర్ట్స్ కళాశాల ఆవరణలో చెట్లు, మొక్కలు, పచ్చికబయళ్లు ఎండిపోకుండా క్యాంపస్‌లో పనిచేసే కార్మికురాలు ప్రతిరోజూ నీళ్లు పెడుతూ ఎండ వేడిమి నుంచి కాపాడుతున్నది

బడీడు పిల్లలను బడికే పంపాలి

డిప్యూటీ డీఈఓ బాలు నాయక్

మారేడ్‌పల్లి, మే 15: మోండా డివిజన్ రైల్‌నిలయం అంబేద్కర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను బుధవారం మారేడ్‌పల్లి జోన్ డిప్యూటీ డీఈఓ బాలు నాయక్, డిప్యూటీ ఐఓఎస్ మదన్‌మోహన్‌లతో కలిసి స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక సందర్శించారు. పాఠశాలలో తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలను బస్తీ వాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ బాలు నాయక్ మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా బడి ఈడు పిల్లలందరిని బడికి పంపించాలని, పిల్లలను పనికి పంపవద్దని సూచించారు. బస్తీ లో ఉన్న విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చే విధంగా బస్తీ వాసులు, పాఠశాల కమిటీ సభ్యులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు లక్ష్మి, కోటమ్మ, చిన్న వీరయ్య, రౌతు రాజయ్య తదితరులు పాల్గొన్నారు .



మారేడ్‌పల్లి అంబేద్కర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ డీఈఓ బాలు నాయక్, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక, తదితరులు

కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి
నివేదిత గెలుపు ఖాయం

రావుల సతీష్, బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారుడు

మారేడ్‌పల్లి, మే 15 : కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి జి. నివేదిత గెలుపు కోసం కృషి చేసిన ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు రావుల సతీష్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారుల్లో ఉత్సాహాన్ని నింపుతూ...ఐక్యమత్యంతో అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలందరూ సైనికుల్లా పని చేశారని తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత గెలుపు కోసం ఎంతో కృషి చేశారని చెప్పారు. కంటోన్మెంట్ గడ్డ పై బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు.

యువత నైపుణ్యాలను
మెరుగు పరచుకోవాలి

మణికొండ, మే 15: యువతలో సృజనాత్మకత, ఆవిష్కరణలో పోటీతత్వం పెంపొందించడమే లక్ష్యంగా పని చేయాలని ఐఐటీ ఢిల్లీ ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ప్రతినిధి వనిత వోసుదేవ్ అన్నారు. గండిపేట్‌లోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన వాతావరణం, సుస్థిరత అంశంపై సమావేశం జరిగింది. సాల్వ్ ఫర్ టుమారో సెన్సిటైజేషన్ సెషన్‌లో వనిత మాట్లాడుతూ.. సాంసంగ్ ఇండియా విద్యార్థుల్లోని ఆవిష్కరణల స్ఫూర్తికి వేదికగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్ రెడ్డి, సంస్థ ప్రతినిధి అరుణరాజ్, రంజిత్‌సింగ్, ముస్కాన్, వెంకట్‌రెడ్డి, మాధవి, ప్రవీణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు పరిశీలన

సీతాఫల్‌మండి చౌరస్తాలో పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ, చిత్రంలో ఏఈ కౌశిక్ తదితరులు

సికింద్రాబాద్, మే 15 : సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ సామల హేమ అన్నారు. బుధవారం సీతాఫల్‌మండి చౌర స్తా నుంచి సుభాష్ చంద్రబోస్ నగర్ వరకు రూ.17 లక్షలతో జరుగుతున్న పైపులైన్ పనులను కార్పొరేటర్ జీహెచ్ఎంసీ అధికారి ఏఈ కౌశిక్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం సామల హేమ మాట్లాడుతూ.. పైపులైన్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

బాధ్యతగా విధులు నిర్వహిస్తా

సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన డి.వి.రామకృష్ణ



డి.వి.రామకృష్ణను అభినందిస్తున్న సంఘ్ ప్రతినిధులు

అమీర్‌పేట్, మే 15: రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ పేరు ప్రతిష్టలు పెంచేలా తన వంతు కృషి చేస్తానని డీవీ. రామకృష్ణ అన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా డి.వి. రామకృష్ణను ఎన్నుకున్నారు. బుధవారం జరిగిన సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ 226వ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఎస్ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య నేతృత్వంలో సికింద్రాబాద్ లోకో రన్నింగ్ స్టాఫ్ బ్రాంచ్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తనకు సంఘ్ సికింద్రాబాద్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై డి.వి.రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సంఘ్ ప్రతినిధులు డి.వి.రామకృష్ణను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

కొత్త బాధ్యతలు అప్పగించడంలో తన వంతు సహకారాన్ని అందించిన సంఘ్ సంయుక్త ప్రధాన కార్యదర్శి భరణి భానుప్రసాద్, సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ ప్రభురాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

ఆర్కేపురం, మే 15 : నర్సుల సేవలు మరువలేనివని ఓజోన్ హాస్పిటల్స్ ఎండీ. బీవీ సత్యసాయి ప్రసాద్ తెలిపారు. ఇంటర్నేషనల్ నర్సుల దినం సందర్భంగా బుధవారం ఆర్కేపురంలోని ఓజోన్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ వైన్ ఓవేన్ ముఖ్య అతిథిగా హాజరై నర్సులకు క్యాన్సర్ ప్రివెన్షన్ ఫ్రీ వ్యాక్సిన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉంటేనే అందరికీ మంచిదన్నారు. గర్భాశయం ముఖ ద్వారానికి సంబంధించిన 30 ఏండ్లు పైబడ్డ వారికి వస్తుందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే రాకుండా అరికట్టవచ్చన్నారు. గర్భాశయ క్యాన్సర్‌పై అందరికీ అవగాహన ఉండాలని తెలిపారు.

బోర్డు దృష్టికి సమస్యలు

కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు పరిధిలోని అంబేద్కర్‌నగర్,సదర్ బజార్ బస్తీలో డ్రైనేజీ సమస్యతో బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరసింహన్ కన్నన్ బస్తీలో పర్యటించి సమస్యను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జి.వి.బాల్‌రాజు, అర్వింద్, సతీష్, నిఖిల్,సుభాష్ రెడ్డి,నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.– బొల్లారం, మే 15

ప్రతిభా పురస్కారాల ప్రదానం

పురస్కారగ్రహీతలతో విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్

ముషీరాబాద్, మే 15 : రసమయి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో బాల ప్రతిభావంతులకు పురస్కారాలు ప్రదానం చేశారు. విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, ఛాయాగ్రహణంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలలకు పురస్కారాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నాట్య గురువు ఎస్.పి. భారతి, రసమయి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ఎం.కె.రాము, ములుగు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అలరించిన.. సినీ సంగీత విభావరి

చిక్కా దేవదాసుకు పురస్కారాన్ని అందజేస్తున్న పద్మశ్రీ కొలకలూరి ఇనాక్

ముషీరాబాద్, మే 15: కళానిలయం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. కె. బాపిరాజు ఆధ్వర్యంలో గాయకులు రేవతి, శ్రీమణి, శివరామకృష్ణ, అరుణ్, రుక్మిణి, సీతారామరావు, రాధాకృష్ణ, సీతారత్నం, సుబ్బిరెడ్డి, వెంకటేశ్వర్ అలపించిన మధుర గీతాలు రంజింప చేశాయి. కార్యక్రమానికి పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ముఖ్యఅతిథిగా విచ్చేసి సామాజిక, ఆధ్యాత్మికవేత్త చిక్కా దేవదాసుకు సహస్ర సేవాధురీణ బిరుదు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీసీపీ సుంకర సత్యనారాయణ, చిక్కా రామదాసు, చింది బద్రీనాథ్, వసంత రాయులు, రాజు నేత, లక్ష్మి, నరేందర్, సురేందర్ పాల్గొన్నారు.

మొబైల్ చోరీ

బంజారాహిల్స్, మే 15: సాయం చేయాలంటూ కోరి మొబైల్ ఫోన్‌ను తస్కరించిన వ్యక్తులపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. లంగర్‌హౌజ్‌లోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఎం.విజయ్‌కుమార్ ఈనెల 11న ఓయూకాలనీలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. భీమాస్ హోటల్‌లో టిఫిన్ చేసి కారు తీసుకునేందుకు వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి అతడి సమీపంలో కిందపడిపోయినట్లు నటించారు. వారిలో ఓ వ్యక్తి రోడ్డుమీద పడి ఉండగా రెండో వ్యక్తి బైక్ లేపడానికి ప్రయత్నిస్తూ సాయం చేయాలంటూ విజయ్‌కుమార్‌ను కోరాడు. దీంతో బైక్‌ను లేపగానే వేగంగా ఇద్దరూ కలిసి ముందుకు దూసుకెళ్లారు. వారు వెళ్లిన తర్వాత తన జేబులో చూసుకోగా మొబైల్ కనిపించలేదు. సాయం కోరిన వారే మొబైల్ ఫోన్ తస్కరించి ఉంటారని బాధితుడు బుధవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మాస్క్ ధరించి.. చోరీ

బంజారాహిల్స్: అర్ధరాత్రి వేళ మాస్కు ధరించిన వ్యక్తి ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ గదిలో చోరీ చేశాడు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటనా వివరాలు.. నవోదయకాలనీలోని విశాల్ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో వీరయ్యనాయుడు వాచ్‌మెన్. మంగళవారం అర్ధరాత్రి గది బయట వీరయ్య, లోపల అతడి కొడుకు పడుకొన్నారు. కాసేపటికి అలికిడి కావడంతో నిద్ర నుంచి వీరయ్య మేల్కొని పట్టుకునేందుకు యత్నించగా పారిపోయాడు. ఒంటిపై బ్లాక్ కలర్ డ్రెస్‌తో పాటు ముఖానికి మాస్క్ ధరించిన ఆగంతకుడు సుమారు 35 వేల నగదు, సెల్‌ఫోన్ తస్కరించాడని వీరయ్యనాయుడు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గుర్తింపులేని కాలేజీల
జాబితాను ప్రకటించాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ బోర్డ్ అనుమతి లేకుండా కొనసాగుతున్న జూనియర్ కాలేజీల జాబితాను ప్రకటించాలని ఏఐవైఎఫ్ ప్రతినిధి బృందం కోరింది. రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి శృతి ఓజాకు కోరుతూ బుధవారం వినతిపత్రాన్ని ఏఐవైఎఫ్ ప్రతినిధులు అందజేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ.. వేసవి సెలవులు పూర్తికాకుండానే ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్లను తీసుకుంటున్నాయని ప్రభుత్వ నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పర్యాటక ప్రదేశంగా..! అమరవీరుల స్థూపం, ఆ పక్కనే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహం పక్కపక్కనే ఉన్నట్లు కనిపిస్తున్నాయి. నిజానికి అమరవీరుల స్థూపం సచివాలయం ఎదురుగా ఉండగా, అంబేద్కర్ విగ్రహం ఐమాక్స్ పక్కన ఉన్నది. కాని ఇక్కడ ఈ దృశ్యాన్ని చూస్తే పక్క పక్కనే ఉన్నట్లు కనిపిస్తున్నాయి. ఇలాంటి అద్భుతమైన కట్టడాలను కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు వాటిని ఏర్పాటు చేయించారు. అవి ఇప్పుడు పర్యాటక ప్రదేశాలుగా నిలిచాయి. నిత్యం వాటిని వందల సంఖ్యల్లో సందర్శించి సెల్ఫీలు దిగుతూ పరవశించిపోతున్నారు.

వాహనాలకు.. నంబర్ ప్లేట్ తప్పనిసరి

నంబర్‌ప్లేట్ తప్పనిసరి ఉండాలని, లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని చిక్కడపల్లి సీఐ సీతయ్య అన్నారు. బుధశారం సీఐ ఆధ్వర్యంలో నంబర్ ప్లేట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. అడ్మిన్ ఎస్సై నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

- చిక్కడపల్లి

ప్రజా సమస్యలను పరిష్కరిస్తా

కేపీహెచ్‌బీ కాలనీ, మే 15 : శంశీగూడలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ అన్నారు. బుధవారం శంశీగూడకు చెందిన ముఖ్య నాయకులు కార్పొరేటర్‌ను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, శ్మశానవాటిక సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరయ్యాయని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. కాలనీలు, బస్తీల్లో ప్రజా సమస్యలను పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, భాస్కర్‌రెడ్డి, వెంకట్‌నాయక్, గోపాల్, సురేందర్, లింగం, శ్రీనివాస్, సుధాకర్, నర్సింగరావు, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

గల్లీ గల్లీలో గంజాయి

బడంగ్‌పేట, మే 15: గల్లీ గల్లీలో గంజాయి దందా జోరుగా సాగుతోందని.. గంజాయిని నిలువరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందుతోందని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్ ఆరోపించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గంజాయి మత్తులో యువత భవిష్యత్ చిత్తు అవుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నారని.. చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారని ఆరోపించారు. ఏ బస్తీల్లో చూసినా పేదల పిల్లలు గంజాయి బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు లేని గ్రామాలు ఉన్నాయి కానీ.. గంజాయి లేని గ్రామాలు లేవంటే అతిశయోక్తి కాదన్నారు. పోలీసులు గంజాయిని నిలువరించడానికి ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయడం లేదన్నారు.

పోలీసులకు సమాచారం వస్తే అడపదడపా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారని చెప్పారు. మీర్‌పేట, బాలాపూర్, పహాడీషరీఫ్, ఆబట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయిని నిలువరించడానికి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయించాలన్నారు. యువత గంజాయితో చెడు మార్గంలో పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మత్తులో ఏం చేస్తున్నారో వారికి తెలియదన్నారు. ఇకనైనా పోలీసులు గంజాయి విక్రయ దారులపై ఉక్కుపాదం మోపాలన్నారు. యువత భవిష్యత్‌ను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

రోడ్డు ప్రభావిత స్థలాల సేకరణ ఊసేది..

నిర్మాణదారులు స్థలాలు వదిలినా పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

పార్శిగుట్ట – రాంనగర్ రోడ్డులో సెట్ బ్యాక్ వదిలిన చోట మళ్లీ నిర్మాణాల దృశ్యం

ముషీరాబాద్, మే 15 : ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ – పార్శిగుట్ట ప్రధాన రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఇబ్బందికరంగా మారుతున్నది. రోడ్డు విస్తరణ ప్రతిపాదనలు ముందుకుసాగకపోగా ఇండ్ల నిర్మాణాలు చేపట్టిన వారు రోడ్డు ప్రభావిత స్థలాలు వదిలినా జీహెచ్ఎంసీ అధికారులు చోద్యం చూస్తున్నారు. పార్శిగుట్ట మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. గ్రేటర్ మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా రాంనగర్ – పార్శిగుట్ట ప్రధాన రోడ్డు విస్తరణ చేపట్టాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. నిర్మాణాలు చేపట్టే వారు సెట్ బ్యాక్ వదిలి నిర్మాణాలు చేపడుతుండగా మరికొందరు రోడ్డు ప్రభావిత స్థలం వదలకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. విషయం టౌన్ ప్లానింగ్ అధికారులకు తెలిసినా.. అడ్డుకోవడం లేదు. దాంతో వదిలిన స్థలాల్లో తిరిగి నిర్మాణాలు చేపతున్నారు. రోడ్డు విస్తరణ కోసం వదిలిన స్థలాల్లో కొత్తగా రోడ్డు వేయాల్సి ఉంటుంది.

ఏండ్లు గడస్తున్నా.. ఫలితం శూన్యం

ఏండ్లు గడస్తున్నా అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదు. టౌన్‌ప్లానింగ్ అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిందిగా ఇంజనీరింగ్ విభాగానికి లేఖ రాయకపోవడం వల్లనే పనులు చేపట్టడం లేదని ఆ విభాగం అధికారులు చెప్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు వైఖరి కారణంగా రోడ్డు విస్తరణ కోసం స్థలం వదిలి (వెనక్కి జరిగి) నిర్మాణాలు చేపట్టిన వారు పనైపోయిన తర్వాత ప్రహారీ ఏర్పాటు చేసుకున్నారు. పార్శిగుట్ట రోడ్డులో ఆరు భవనాలు, రాం నగర్ గుండు వద్ద ఒక భవనం, జామై ఉస్మానియా మలుపు వద్ద ఒక భవన నిర్మాణదారులు వదిలిన స్థలాలు జీహెచ్ఎంసీ స్వాధీనం చేసుకొని రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మళ్లీ షాపులు ఏర్పాటు చేస్తే తొలగిస్తాం

రోడ్డు ప్రభావిత స్థలాల్లో మళ్లీ షాపులు ఏర్పాటు చేస్తే తొలగిస్తాం. ప్రధాన రోడ్డులో భవన నిర్మాణ అనుమతికి అనుగుణంగా నిర్మాణాలు చేపట్టిన తర్వాత సెట్ బ్యాక్ స్థలాల్లో రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిందిగా ఇంజనీరింగ్ విభాగాన్ని కోరడం జరుగుతుంది.

- హఫీజ్, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్